క్లుప్తంగా

కమలాపండ్లతో ప్రత్యేక అలంకరణ


వేంకటేశ్వర స్వామి

పెరవలి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండో ద్వారకా తిరుమలగా పేరు గాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. దేవీ నవరాత్రులు సందర్భంగా స్వామి, అమ్మవార్లను పూలతో పాటు కమలాపండ్లతో అలంకరించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలు పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధాన నిర్వహించారు. 5 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

వాహనాల ఢీ

నల్లజర్ల: పదహారో నంబరు జాతీయ రహదారిపై పుల్లలపాడు వద్ద శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఒక వాహన డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి నాలుగు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో భవానీ మాల ధారునికి గాయాలయ్యాయి. రహదారిపై మొదటి ఒక నల్ల కారు సడన్ బ్రేక్ వేయడంతో దాని వెనుక వస్తున్న తెల్లకారు, ఎర్రకారు, లారీ ఈ మూడు ఢీకొన్నాయి. దీనిలో ఎర్రకారులో ప్రయాణిస్తున్న భవానీ మాలధారి వేములూరి సీత(56)కు తలపై గాయంకాగా హైవే అంబులెన్స్ సిబ్బంది ఆమెను నల్లజర్ల పీహెచ్‌సీకి తరలించారు. ఆమె అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందినవారు. మిగతావారంతా సురక్షితంగా ఉన్నారు. మూడు కార్లు దెబ్బతిన్నాయి.

ప్రజాప్రతినిధుల కృషితోనే గ్రామాల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

గోపాలపురం: ప్రజాప్రతినిధుల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు ఇచ్చిన హామీలను అమలు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే మండలం అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులతో ఆయా గ్రామాలలో డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, వైస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ, సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో కంటి వైద్య శిబిరం

కొవ్వూరు: పట్టణంలో కోర్టు ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్.శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రరానికి చెందిన బుద్ధుడు కంటి వైద్యశాల డాక్టర్లు న్యాయమూర్తులు, స్థానికులకు కంటి పరీక్షలు చేశా రు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మరావు, సెకండ్ అడిషనల్ అండ్ జ్యూడిషియల్ ఫస్టక్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జేబీటీఎస్ దేవీ, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం


నిడదవోలు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రవాణా చేసే ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటుతో రైతులకు ఎంతో ప్రయోజనమని శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యళ్ల రామారావు అన్నారు. నిడదవోలు మండలంలోని ఆయా ఆర్‌బీకేల పరిధిలో ఉన్న ట్రాక్టర్లకు శనివారం జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. రైతులకు రవాణా, లోడింగ్ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని రామారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అన్సారీ, సొసైటీ కార్యదర్శి పెద్దిశెట్టి ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం

గోపాలపురం: మండల మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు గుండె ఆపరేషన్ చేయించుకున్న పేద వ్యక్తికి శనివారం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిట్యాల గ్రామానికి చెందిన నూతంగి సుబ్రహ్మణ్యం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. అతని పేదరికాన్ని గమనించిన మానవత సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు కె.రాధాకృష్ణ, జుత్తగ వెంకట్, పెనుగొండ బాలాజీ, బూసి మురళీకృష్ణ, ఎలిపే రాజశేఖర్ ఉన్నారు.


తాళ్లపూడిలో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ


చీపురుగూడెం-తిమ్మన్నపాలెంలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనం


గవర్లపాలెంలో శాకంబరీ దేవిగా అమ్మవారు


పాలంగిలో శ్రీలలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో కనకదుర్గమ్మ


బ్రాహ్మణగూడెంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ

జగజ్జననీ .. శక్తి స్వరూపిణీ..

- లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాళ్లపూడి: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు మూడు నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. తాళ్లపూడిలోని నవదుర్గా శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శినమిచ్చింది. అర్చకులు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్రనామార్చన, లలితా పారాయణం, పల్లకీ సేవ తదితర పూజలు చేశారు.

నల్లజర్ల: చీపురుగూడెం-తిమ్మన్నపాలెం గ్రామాల మధ్య ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వంట్ల పెదరామన్న దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. నల్లజర్లలో వనదుర్గదేవికి బాలాత్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతపల్లి స్వర్ణదుర్గాశ్రమంలో ఏలూరు సీఐ నల్లం దుర్గాప్రసాద్, మాధవి దంపతులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతపల్లి అన్నపూర్ణదేవి ఆలయంలో అమ్మవారికి లలితా త్రిపుర సుందరీ అలంకారం చేశారు.


తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉండ్రాజవరం: మండలంలో పలు గ్రామాల్లో శనివారం అమ్మవార్ల లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. మోర్త, ఉండ్రాజవరం కనకదుర్గమ్మ, వేలివెన్ను కొండాలమ్మ, కె.సావారం ముత్యాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పాలంగిలో కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శినమిచ్చారు.

దేవరపల్లి: మండలంలోని దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అమ్మవారిని లలితాత్రిపుర సుందరిదేవిగా అలంకరణ చేసి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారిని లలితా త్రిపురసుందరిదేవిగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

పెరవలి: గవర్లపాలెంలో కనకదుర్గమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారికి పూజలు చేశారు. ముక్కామలలో గాయత్రిదేవీ అవతారంలో అమ్మవారిని అలంకరించారు.

మహాలక్ష్మీదేవిగా..

చాగల్లు: చాగల్లులో మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఊనగట్లలో కనకదుర్గమ్మ అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రాహ్మణగూడెంగ్రామదేవత నాగారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామంలోని గౌడవీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని శనివారం మహాలక్ష్మిగా అలంకరించారు. స్థానిక వరసిద్ధి వినాయక యువజన గౌడసంఘం ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల నగదుతో రూ.500 నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

తిమ్మరాజుపాలెంలో..

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏడో రోజైన శనివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారికి 304 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీపారాయణం, హోమాలు నిర్వహించారు. కోటసత్తెమ్మ అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,70,296 విరాళాలు వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) చెప్పారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో పుంతలోముసలమ్మ ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లను దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.


తాడిమళ్లలో రూ.1.50 లక్షల నగదుతో మహాలక్ష్మి అలంకరణలో దుర్గాదేవి

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పోతవరం పీహెచ్‌సీ పరిధిలోని తూర్పుచోడవరంలో శనివారం జగనన్న వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీటీసీ చోడసాని సునీత, గ్రామపెద్ద గన్నమని సుబ్బారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే వైద్యశిబిరాన్ని సందర్శించి క్యాంపులో అందిస్తున్న సేవలను ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. శిబిరంలో 712 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 19 మందిని ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, బంక అప్పారావు, వెంకటరత్నం,శ్రీరామారావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం

పెరవలి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంపీపీ కార్నెల్ల ప్రసాద్ పేర్కొన్నారు. ఖండవల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించి రోగులకు కిట్లు అందించారు. ఈ వైద్య శిబిరంలో 627 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సలు నిమిత్తం 16 మందిని రిఫర్ చేసినట్టు వైద్యులు ఏహెచ్ విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీఓ దామోదరరావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ పులిదండి నాగరాజు ఎంపీటీసీ సభ్యులు పల్లేటి రవి, బొకే వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు కుసుమే సూరిబాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


తూర్పుచోడవరం వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

బ్రాహ్మణగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య వైద్య శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. వైద్యులు 710 మందికి సేవలు అందించారు. సర్పంచ్ గురువెల్లి కుమారి, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వుండవల్లి శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాద్రి, ఉపసర్పంచ్ సుబ్బారావు, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పసలపూడిలో 452 మందికి..

ఉండ్రాజవరం: పసలపూడి గ్రామంలో శనివారం సర్పంచ్ కట్టా లక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబరంలో సుమారు 452 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి పాల్గొని రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్‌కే రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, సూర్యారావుపాలెం సొసైటీ అధ్యక్షుడు చామర్తి తమ్మిరాజు, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ షాజహాన్, కట్టా గోపాలకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఖండవల్లి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

యర్నగూడెంలో..

దేవరపల్లి: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ పెద్దపీట వేసిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. యర్నగూడెం గ్రామ సచివాలయం-2 వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంతా భరత్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ శిబిరంలో 520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, పామాయిల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్ర బాబు, ఎంపీటీసీ సభ్యులు బొంతా చినబాబు, సొసైటీ అధ్యక్షురాలు నరహరిశెట్టి వైదేహి, మాజీ అధ్యక్షులు పోతుల కనకరాజు, ఉపసర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు, మండల ప్రత్యేక అధికారి జి. రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపాలెంలో

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ పడాల రంగారావు శనివారం ప్రారంభించారు. శిబిరంలో 486 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, స్థానిక నాయకులు పడాల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, తహసీల్దార్ ఎం.గంగరాజు, కార్యదర్శి కేవీ సుబ్బన్న, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: పట్టణంలోని బీసీ కమ్యూనిటీ హాలులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పరిశీలించారు. వైద్యులు 322 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సురక్ష కిట్ల, వృద్ధులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఇ.తేజశ్రీ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 18 కేసుల పరిష్కారం


కొవ్వూరు లోక్ అదాలత్‌లో కక్షిదారులను విచారిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

కొవ్వూరు: పట్టణంలో జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 18 కేసులు పరిష్కారమైనట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు యాక్సిడెంట్స్‌కి సంబంధించి 17 కేసుల్లో కక్షిదారులకు రూ.85.35 లక్షలు చెల్లించేలా కేసులు రాజీ పద్దారన్నారు. ఒక ప్రీ లిటికేషన్ కేసులో రూ.3 లక్షలు చొప్పున చెల్లించేటట్లు ఇరు పక్షాలు రాజీ పడడంతో కేసు పరిష్కారమైందన్నారు.

కామేశ్వరరావు నియామకంపై హర్షం

ఉండ్రాజవరం: కోనసీమకు చెందిన కామేశ్వరరావును రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంపై ఉండ్రాజవరం బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ బ్రాహ్మణ సంక్షేమానికి అందిస్తున్న పథకాలు అర్హులందరికీ సకాలంలో అందేలా కామేశ్వరరావు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకెళ్ళ శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్, ఈ.సత్యకృష్ణ, దోనేపూడి శ్రీరాంపవన్, కె.గోపాలకృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, రాపర్తి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటకు గిట్టుబాటు కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


యర్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. యన్నగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసి తేమ శాతం, నూక శాతం యంత్రాలను ఎమ్మెల్యే వెంకట్రావు పరిశీలించారు. నూక శాతం యంత్రాన్ని సొసైటీ ద్వారా జిల్లాలో మొదటిసారి యర్నగూడెంలో ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. దీని వల్ల నూక శాతాన్ని కొనుగోలు కేంద్రం వద్ద పరిశీలించి మిల్లుకు ధాన్యాన్ని తరలించవచ్చునని ఆయన తెలిపారు. నూకశాతం యంత్రం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఆర్‌బీకే వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కోసిన పంటను సకాలంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. గోనెసంచుల కొరత లేదన్నారు. రైతులు తొందర పడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పామాయిల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్ర బాబు, సొసైటీ అధ్యక్షురాలు నరహరిశెట్టి వైదేహి, సొసైటీ సీఈఓ మండా పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు బొంతా చినబాబు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం యర్నగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసి రేషన్ షాపు (నెంబరు 7)ను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. గతంలో పని చేసిన రేషన డీలరు రాజీనామా చేయడంతో స్థానిక స్వయం సహాయక సంఘానికి దుకాణం కేటాయించారు.

ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించండి

నల్లజర్ల: ఈనెల 27న ముసాయిదా ఓటర్ల జాబితా వస్తుందని దానిని బీఎల్‌ఓలంతా క్షుణ్ణంగా పరిశీలించి, తప్పలు లేకుండా కచ్చితమైన జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దారు కిశోర్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో వస్తున్న పొరపాట్లు, ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో 66 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కుటుంబ సభ్యులందరూ ఒకే బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. మార్పులు, చేర్పులకు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలన్నారు. మరణించిన వారి పేర్లు ఉంటే నిర్ధారించుకొని తొలగించాలన్నారు. సమావేశంలో నాయకులు కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, కండెపు రామకృష్ణ, చెల్లు సత్యనారాయణ, గుదే వెంకట సుబ్బారావు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాధాబాయ్, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ కె.యోహాన్ పాల్గొన్నారు.

అమర వీరులకు జోహార్లు


ర్యాలీలో పాల్గొన్న ఎస్సై తదితరులు

తాళ్లపూడి: విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేని వని తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ అన్నారు. తాళ్లపూడిలో శనివారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్సై ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, ఇతర ప్రముఖులతో కలిసి తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ వరకూ అమరవీరులకు జోహార్లు తెలుపుతూ ర్యాలీ చేశారు. ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ముళ్ల మల్లిబాబు, ఆటో యూనియన్ నాయకులు కడవుల రజనీకమార్, కానిస్టేబుళ్ళ, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: అమరవీరుల త్యాగాలు మరువలేమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి స్థానిక గణేష్‌చౌక్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిడదవోలు రూరల్ ఎస్సై ఎస్‌కే సుభాని, ఏఎస్సై జి. పరమహంస, రైటర్ చింతా రాజు, ఆటో డ్రైవర్లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో పడి ఉన్న యువకులు

కొవ్వూరు: పట్టణ శివారున సీఎస్‌జీ బంక్ సమీపంలో శనివారం రాత్రి డివైడర్‌ను మోటారుసైకిల్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రగాయాలలయ్యారు. లారీని ఓవర్ టేక్ చేసే యత్నంలో డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి పడ్డారు. ఈ ప్రమాదంలో పాతూరు శివాలయం ప్రాంతానికి చెందిన చింతలపూడి సాయికృష్ణ, రెండో వార్డుకి చెందిన మానేపల్లి రాకేష్‌లకు బలమైన గాయాలయ్యాయి. తల డివైడర్‌కు తగలడంతో తీవ్ర రక్తస్రవమైంది. దీంతో ఇద్దరు యువకులు స్పృహ కోల్పోయారు. ఈ ఇద్దరు యువకులతో మోటారుసైకిల్ ఉన్న మరో యువకుడికి గాయాలపాలయ్యారు. ఈ యువకులు వేసుకెళ్లిన మోటారుసైకిల్ డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై వెళుతున్న మరో మోటారుసైకిల్ కి తగిలింది. దీంతో ఆ మోటారుసైకిల్‌పై వెళుతున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో రాజమహేంద్రవరం తరలించారు. పట్టణ సీఐ వి.జగదీశ్వర రావు, ఎస్సై డి.భూషణం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాద ఘటనకి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.